ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | ఆదివారం | 09.08.2026 | సంపుటి : 2 | సంచిక : 38 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు

# శ్రీశైలానికి ప్రాజెక్ట్‌కు జోరుగా వరద

## 876.20 అడుగులకు నీటిమట్టం

### విద్యుదుత్పత్తితో 66,460 క్యూసెక్కుల నీరు సాగర్‌కు విడుదల

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం రాత్రి 9 గంటల సమయంలో జూరాలకు 1,73,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 21 గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా 1,38,495 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా విడుదల వుతున్న నీటితో కలిపి మొత్తం 1,68,020 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి చేరుతోంది.



శ్రీశైలం,ఆగస్ట్ 8 : జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా.. శనివారం సాయంత్రానికి 317.31 మీటర్లకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.567 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.297 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం నీటిమట్టం 877.70 అడుగులుగా నమో దైంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. రెండు కేంద్రాల నుంచి కలిపి 62,493 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు వెళ్తోంది. కాగా, ప్రస్తుతం ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద ప్రవాహం ఇదే స్థాయిలో మరో మూడు, నాలుగు రోజులు

-మిగతా 2 లో..



## మళ్లీ బంగారం ధరల పరుగు

04



## ఎంతోకాలం యుద్ధంతో తీవ్ర నష్టం

- ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు
- ట్రంప్‌నకు జనరల్ డాన్ కేన్ సలహా ఇచ్చినట్లు ప్రచారం

04



## సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు

### రైతులు ఆరుతడి పంటలనే వేయాలి

ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి

ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

నల్గొండ, ఆగస్టు 8 : నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ

## క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు

నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది

నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి

మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 8 : క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా?

-మిగతా 2 లో..





## సాగునీటి ప్రాజెక్టులకు 5వేల కోట్లు మంజూరు

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం

తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, ఆర్‌ఆర్ కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు.

హైదరాబాద్,ఆగస్టు8 : పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణెళి లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని

-మిగతా 2 లో..

## హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట



హైదరాబాద్, ఆగస్ట్ 8 : నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా

కాంగ్రెస్ అణచివేతకు ఇదే నిదర్శనం

సరూర్‌నగర్ ఘటనపై మండిపడ్డ రాంచంద్రరావు

హైదరాబాద్, ఆగస్ట్ 8 : సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్ర బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో 'మొహబ్బత్ కీ దుకాణ్' అని గొప్పలు చెప్తూ, తెలంగాణలో మాత్రం ఉపాధి కోరిన యువతపై లాఠీలు ఝళిపిస్తున్నారని విమర్శించారు.



-మిగతా 2 లో..



## డిగ్రీతోనే ఉద్యోగం రాదు

పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం ఉండాల్సిందే: మంత్రి శ్రీధర్‌బాబు

గ్రామీణ ప్రాధాన్యతగా 119 టెక్నాలజీ సెంటర్లు: మంత్రి వివేక్

02

## ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు 35,125 దరఖాస్తులు

దరఖాస్తుకు మరో రెండు రోజులే గడువు

ఈనెల 20 తర్వాత లాటరీ ప్రక్రియ

హైదరాబాద్, ఆగస్టు 8 : అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో క్యూర్ పరిధిలో తలపెట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకానికి భారీ స్పందన వస్తోంది. ఈ ఫ్లాట్ల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఇందిరమ్మ టవర్స్ కింద మొత్తం లక్ష ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే.

-మిగతా 2 లో..



# ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు 35,125 దరఖాస్తులు



(మొదటిపేజీ తరువాయి)

పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గంలోనూ 500 ఇళ్ల చొప్పున నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతోంది. ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ ఇళ్ల కోసం శనివారం సాయంత్రానికి 35,125 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంతో విలువైన భూముల్లో నిర్మిస్తున్న ఈ ఇండ్లను కేవలం నామమాత్రపు ధరకే అందిస్తున్నట్లు వివరించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షల నుంచి రూ.58లక్షల వరకు ధర పలికే ఈ ఫ్లాట్లను ప్రజల సంక్షేమం కోసం వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్న ఉద్దేశంతో కేవలం రూ.6 లక్షల రూపాయలకే ప్రభుత్వం కేటాయిస్తోందని ఆయన తెలిపారు. అంతే కాకుండా ఇళ్లు పొందిన వారికి రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. ఇళ్లు కేటాయించని పక్షంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు ఫీజు రూ.10వేలు తిరిగి చెల్లిస్తామన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులకు ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఈ నెల 20 వ తేదీ నుంచి చేపట్టాలని హౌసింగ్ బోర్డు అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ ఇళ్లన్నింటినీ ఒక ఏడాది లోపే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా పకడ్బందీ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వి.పి.గౌతం వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్ కు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కాల్ సెంటర్ ఫోన్ నంబరు 040--24603572ను సంప్రదించవచ్చు. ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు కూకట్‌పల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 5,233 దరఖాస్తులు వచ్చాయి. ఖైరతాబాద్‌లో 4,394, అంబర్‌పేటలో 2,357, బహదూర్‌పురలో 1,135, ఇబ్రహీంపట్నంలో 749, కార్వాన్‌లో 1,574, మహేశ్వరంలో 471, మలక్‌పేటలో 2,846, మల్కాజిగిరిలో 1,033, మేడ్చల్‌లో 1,153, నాంపల్లిలో 3,613, సనత్‌నగర్‌లో 1,046, కుత్బుల్లాపూర్‌లో 4,121, రాజేంద్రనగర్‌లో 1,496, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 1,374, శేరిలింగంపల్లిలో 2,530 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.



## సాగునీటి ప్రాజెక్టులకు 5వేల కోట్లు మంజూరు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.




## సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు

(మొదటిపేజీ తరువాయి)

కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు. కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెలెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్‌-ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్‌ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకూ పనికిరాకుండా పోతాయని మంత్రి అన్నారు. విపరీతంగా ఎరువులు వాడటం, నిరంతరం వరి సాగు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా.. తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా

(మొదటిపేజీ తరువాయి)

హైడ్రాలో కేవలం 150 ఖాళీల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ తీవ్రతకు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సాక్ష్యమని రామచందర్ రావు అన్నారు. అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, స్వయం ఉపాధికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తు చేశారు. అయితే రెండేళ్లు గడిచినా ఒక్క హామీనీ నెరవేర్చలేదని ఆయన మండిపడ్డారు. హామీలను నమ్మి ఓటేసిన యువతను రోడ్లపాలేసి, కనీసం ఆశతో వచ్చిన వారిపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ యువత ఆకాంక్షలపై అధికారంలోకి వచ్చారో, అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టివేసిందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులపై పోలీసుల ప్రయోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, యువతకు సమాధానం చెప్పాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

## శ్రీశైలానికి జోరుగా వరద

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగితే శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వకు చేరుకునే అవకాశం ఉంది. దీంతో శ్రీశైలం గేట్లు ఎత్తి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆల్మట్టి జలాశయానికి 1.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఔట్‌ఫ్లోగా సుమారు 1.38 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.42 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 1,26,231 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఒకవైపు కృష్ణా, భీమా నదులు పొంగిపొర్లుతూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తుంటే రాష్ట్ర సర్కార్ పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయకుండా దోబూచులాడుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మరో నాలుగు మోటర్లతో కూడా నీటిని ఎత్తిపోయొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు ప్రాజెక్టులకు నీటిని వదలకుండా కృష్ణా జలాలను వృథాగా దిగువకు వదిలిపెడుతున్నదని పాలమూరు నేతలు మండిపడుతున్నారు. ఇదిలావుంటే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు 42,114 క్యూసెక్కుల ఇన్ ఎ÷-లో కొనసాగింది. ప్రస్తుతం డ్యాంలో 1,623.68 అడుగులకు గాను 72.26టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. తాగునీటి అవసరాలు కోసం వివిధ కాల్వలకు 1,514 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగునీటి విడుదలపై ఈనెల 11 తేదీన కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

(మొదటిపేజీ తరువాయి)




కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్‌ఎస్ ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్‌ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్‌ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూ-ర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్‌ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.



## హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

## డిగ్రీతోనే ఉద్యోగం రాదు

- పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం ఉండాల్సిందే: మంత్రి శ్రీధర్‌బాబు
- గ్రామీణ ప్రాధాన్యతగా 119 టెక్నాలజీ సెంటర్లు: మంత్రి వివేక్

**హైదరాబాద్, ఆగస్టు 8 :** విద్య, పరిశ్రమ, ఉపాధిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి యు-వతను భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మార్కుల మెమోలతో డిగ్రీలను అందించే వ్యవస్థ నుంచి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసంతో కూడిన యువతను తయారు చేసే గమ్యం వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు. రాయదుర్గంలోని టీ--వర్క్స్ ప్రాంగణంలో శనివారం జరిగిన ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్--అవార్డ్స్--2026 కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ వంటి వృత్తి విద్యా కోర్సుల నుంచి ఏటా 2 లక్షల మందికి పైగా గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. వారికి డిగ్రీలు, ప్రతిభ, ఎదగాలన్న బలమైన ఆకాంక్ష ఉన్నప్పటికీ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో డిగ్రీ ఒక్కటే సరిపోదన్నారు. పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారే శక్తి, నిరంతరం నేర్చుకునే తత్వం అవసరమని చెప్పారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగంలో సుమారు 20 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు స్టైపెండ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు మెరుగుపర్చి మంచి ఉద్యోగం పొందేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాష్ట్రంలోని 119 టెక్నాలజీ సెంటర్లను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన విద్యార్థులకు స్టైపెండ్ ఇచ్చి నైపుణ్యాలను నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# 'ఫ్యూచర్'లో డ్రైవర్‌లెస్ మొబిలిటీ

- అందుకుగల అవకాశాలు పరిశీలించండి
- 'వేమో'ప్రతినిధులతో భేటీలో డిప్యూటీ సీఎం భట్టి
- శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆ సంస్థ డ్రైవర్‌లెస్ కారులో ప్రయాణం
- తెలంగాణ ప్రవాసులతో సమావేశం.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు



**హైదరాబాద్, ఆగస్టు 8 :** నూతన తరం మొబిలిటీ సాంకేతికతను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీలలో అనుసంధానించే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వేమో (గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్‌కు చెందిన రోబో ట్యాక్సీ సేవల సంస్థ) ప్రతినిధులను కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కో లోని భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐ ఎస్‌ఎఫ్‌ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో భట్టి సమావేశమయ్యారు. ఇందుకోసం ఆయన వేమో స్వయంచాలక (డ్రైవర్‌లెస్) వాహనంలో ప్రయాణించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికత, దాని నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ నగరంతోపాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక మొబిలిటీ పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై ఆరా తీశారు. ఇందుకు అవసరమైన అధిక రిజల్యూషన్ మ్యాపింగ్, సెన్సార్ అనుకూల రోడ్డు డిజైన్, ప్రత్యేక టెస్టింగ్ కారిడార్లు, డేటా కనెక్టివిటీ, ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల గురించి వేమో ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంచాలక వాహనాల ట్రయల్స్, భవిష్యత్ విస్తరణకు అవకాశాలపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం.. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యంగల మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతోపాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని కోరారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష?

- సరూర్‌నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే
- రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్, ఆగస్ట్ 8 :** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

# నేడు నర్సంపేటకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

## పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శ



**వరంగల్, ఆగస్టు 8 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు నర్సంపేటకు రానున్నారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించ నున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కేసీఆర్ విషాదంలో మునిగిపోయారు. ఈ క్రమంలో తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఆయన నర్సంపేట రానున్నారు. ఈ మేరకు, ఆదివారం నాడు నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి బయలుదేరి వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా, ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులై వున్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్ట కాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో, నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం ఇవ్వనున్నారు. కాగా, పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్ గారు, ఇప్పటికే 2 కోట్ల 25 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం ప్రకటించారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరఫున రెండు కోట్ల 25 లక్షల రూపాయలలను అందజేయాలని నిర్ణయించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగానే సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. అలాగే పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# మరింత విషమంగా మెడికో ప్రియాంక ఆరోగ్యం

## వెంటిలేటర్‌పై కొనసాగుతున్న చికిత్స

**హైదరాబాద్,ఆగస్ట్8 :** రాజమండ్రి మెడికో విద్యార్థిని ప్రియాంక ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై వైద్యులు ఆమెకు చికిత్స అందజేస్తున్నారు. ఇటీవల రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్యామాల్‌లో స్కూటీపై వెళ్తున్న మెడికోలు డాక్టర్ ప్రియాంక, దుర్గవెంకటసాయిలను మద్యం సేవించిన కొందరు యువకులు కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ నేపథ్యంలో ప్రియాంక తలపై నుంచి కారు వెళ్లడంతో బ్రెయిన్ డెడ్‌కు గురైంది. దీంతో విద్యార్థినిని హుటాహుటిన రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. గడిచిన ఆరో రోజులుగా ప్రియాంక మృత్యువుతో పోరాడుతోంది. మెడికో ప్రియాంక చికిత్సలో చివరి ప్రయత్నంగా నేడు ఆప్నియా పరీక్ష చేయనున్నారు. కోమాలో ఉన్న ప్రియాంక మెదడు పూర్తిగా పనిచేయడం ఆగిపోయిందా.. లేదా అని నిర్ధారించడానికి డాక్టర్లు కీలకమైన పరీక్ష చేయనున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందా.. లేదా అనేది అప్నియా పరీక్షతో తెలుసుకోనున్నారు. ఆప్నియా పరీక్ష అనంతరం చివరి రిజల్ట్‌ను విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు. అంతేకాకుండా, ప్రియాంక ఆర్గాన్ డొనేషన్ చేసే విషయంపై తల్లిదండ్రులకు ఇప్పటికే పలు మార్లు కిమ్స్ వైద్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు. మెడికో చనిపోయిందని నిర్ధారిస్తే ఆర్గాన్స్ డొనేట్ చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలనే ఆలోచనలో ప్రియాంక కుటుంబం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఔటర్ వద్ద పిల్లర్‌ను ఢీకొన్న కారు

## ఇద్దరు టైల్స్ కార్మికుల దుర్మరణం

**హైదరాబాద్,ఆగస్ట్8 :** నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గచ్చిబౌలి సమీపంలోని నియోపోలిస్ బ్రిడ్జ్ పిల్లర్‌ను టవేరా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు రాజస్థాన్‌కు చెందిన కనైయా లాల్ (25), దేరామ్ (24)గా గుర్తించామని తెలిపారు. వీరిద్దరు టైల్స్ కార్మికులుగా పని చేస్తున్నా రని చెప్పారు. ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్‌రా మ్‌గూడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. అతివే గమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

# భారీవర్షానికి నీట మునిగిన రోడ్డు

## నీటిలో కూర్చుని కార్పోరేటర్ నిరసన

**కామారెడ్డి, ఆగస్టు 8 :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో నీటి కుంటలో కుర్చీని బీఆర్ఎస్‌కు చెందిన 46వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మినారాయణ నిరసన తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లా కేంద్రంలోని కామారెడ్డి నుండి కరీంనగర్ జాతీయ రహదారి అయిన స్టేషన్ రోడ్డు లోని పోలీస్ స్టేషన్ ముందు వరద నీరు ఎటు వైపు కుడా వెళ్లకుండా అక్కడే నిలిచి ఉంది. ఒక ప్రధాన రహదారి ఒక కుంట, ఒక చెరువును తలపిస్తూ రహదారి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వరద నీటి కుంట వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కావున ఈ నీటి కుంటతో ట్రాఫిక్ జామై వాహనదారులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇదే దారిలో ఉంది. రోగులు, క్షతగాత్రులు ఎమ్జ్గ÷న్సీ సమయంలో 108 వాహనం, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇట్టి సమస్యను పరిష్కరించకుంటే అక్కడే దీక్ష చేపడతానని స్పష్టం చేశారు.

# 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు

- కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు
- విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**బెంగళూరు, ఆగస్టు 8 :** 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు వచ్చే ఏడాది వేగవంతం కానున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బెంగళూరులో సర్లా ఏవియేషన్ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి రద్దీగా ఉండే మహానగరాలకు కొత్త రవాణా మార్గాన్ని అందించగలవని అన్నారు. బెంగళూరులోనే కాకుండా, ముంబై, ఢిల్లీలలో కూడా వీటికి చాలా అవసరం ఉందని ఆయన చెప్పారు. 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ సాంకేతికత ద్వారా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని మంత్రి తెలిపారు. గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 20 నుంచి 30 నిమిషాలకు తగ్గుతుందని స్పష్టం చేశారు. 'సర్లా ఏవియేషన్' కంపెనీకి డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్ ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మంజూరు చేసిందని, నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వచ్చే ఏడాది పూర్తిస్థాయి టెస్టింగ్ ఫేజ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలు ముఖ్యంగా ఇది పైలట్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. ఇందులో మొత్తం 7 ఎలక్ట్రిక్ మోటార్లు ఉంటాయి (6 టేకాఫ్ కోసం, 1 ముందుకు వెళ్లేందుకు) ఇది ప్యూర్ ఎలక్ట్రిక్ ఆధారిత విమానం అయినప్పటికీ, అవసరమైతే గాల్లోనే బ్యాటరీ ఛార్జ్ చేసుకునేలా టర్బో-జెనరేటర్ అమర్చే వెసులుబాటు కూడా దీని డిజైన్‌లో ఉంది. స్వదేశీ తయారీ కావడంతో తక్కువ ధర: విమానయాన పరికరాలు (అవియోనిక్స్) మినహా మిగిలిన విడిభాగాలన్నీ భారత్‌లోనే తయారు కానున్నందున ప్రయాణ ధరలు సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. నిఖిల్ కామత్ (జెరోధా), బిన్నీ బన్సాల్ (ఫ్లిప్‌కార్ట్) వంటి దిగ్గజాల మద్దతు ఉన్న ఈ స్టార్టప్‌తో ఇప్పటికే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ శంషాబాద్/లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం, మణిపాల్ హాస్పిటల్స్ ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే నగర ప్రయాణాలే కాకుండా ఎయిర్ అంబులెన్స్, అత్యవసర వైద్య రవాణా, కార్గో సేవల రంగంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించడమే కాక విదేశాలకు కూడా విమానాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# ఏపీ కోసం తెలంగాణ నీళ్ల త్యాగం

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్

**హైదరాబాద్,ఆగస్టు8 :** కర్నాటక, తదితర రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జూరాలకు భారీగా వరద వస్తోందని , వచ్చిన నీళ్లను వచ్చినట్లే తెలంగాణ ప్రభుత్వం మొత్తం ఏపీకి వదిలేస్తుందని బీఆర్ఎస్మాజీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్ష మాట్లాడారు. ఏపీ ప్రభుత్వంతో తెలంగాణలోని రేవంత్ ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుని, తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీ టూర్లపై ఉన్న దృష్టి పాలమూరు రైతులపై లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వర్షాలతో వరద ప్రారంభమైన వెంటనే మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లల్లో నీళ్లను నింపి, రైతులకు సమయానికి నీళ్లను అందించేదని స్పష్టం చేశారు. జూరాలకు వరద వచ్చి పదిహేను రోజులైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రిజర్వాయర్లలో నీళ్లను నింపే ప్రయత్నం కూడా చేయలేదని దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ పనిచేస్తున్నది తెలంగాణ రైతుల కోసమా? పక్క రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసమా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరినో సంతృప్తి పరచడానికే రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

- సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ
- ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్

**చెన్నై, ఆగస్టు 8 :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' ప్రక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణెళి లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ది చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

# నేడు, రేపు హైదరాబాద్‌లో బోనాలు

## పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఆగస్ట్ 8 :** హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# బిజెపివి కార్మిక వ్యతిరేక విధానాలు

## 10న జిల్లా కేంద్రంలో ర్యాలీకి పిలుపు

**రాజన్న సిరిసిల్ల,ఆగస్టు8 :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, కార్మిక చట్టాలు, హక్కులను పరిరక్షించుకోవాలని సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. ఆగస్టు 10న సోమవారం సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్, బీడీ, గ్రామపంచాయతీ, మున్సిపల్, ఆశా, అంగన్వాడీ, హమాలీ, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన, ఆసుపత్రి, గార్మెంట్ తదితర రంగాల కార్మికులు ఉదయం 10 గంటలకు కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అన్నల్దాస్ గణేశ్, నాయకులు సిరిమల్ల సత్యం, దాసరి రూప, సందుపట్ల పోచమల్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం

- కార్పోరేట్‌కు దాసోహమంటున్న మోడీ
- సిపిఐ ప్రచారజాతాలో చాడ విమర్శలు

**కరీంనగర్, ఆగస్టు 8 :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ పెట్టుబడుదారులను ప్రోత్సహిస్తూ సామాన్య ప్రజలను పెనుబారం మోపుతుందని సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ ప్రచార జాతలో భాగంగా చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, సుందరగిరి గ్రామాల్లో ప్రచార జాతలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్తో కలిసి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి దేశ అభివృద్ధి ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమం సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఏ ఒక్కటి అమలు చేయడం లేదని అన్నారు. నిత్యాసరాల పెంపు, పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్యాలకు భారంగా మారిందన్నారు. రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తే దేశ వ్యాప్తంగా ఆందోళన నిర్వహించి కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎండగడతామన్నారు. రైతులకు కనీసం మద్దతు ధర చట్టం తెస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పండించిన పంటలకు కనీసం మద్దతు చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని, ధరల పెంపులను నియంత్రించాలని, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల చట్టాలను పరిరక్షించుకోవాలని స్వయంగా సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ సమాన పనికి సమాన వేతనం కార్మికులకు అందించడంలో కేంద్ర విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందే స్వామి తదితరులు పాల్గొన్నారు.

జనం వార్త

# బొద్దింకల వేటలో రాహుల్!



**బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు.**

ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్దతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు.

జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్దం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ ఘూవత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు.

కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడంలేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్ముందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

# అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

## అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8 :** భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రిత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చరీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని .. జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.



# ఎంతోకాలం యుద్ధంతో తీవ్ర నష్టం

- ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు
- ట్రంప్‌నకు జనరల్ డాన్ కేన్ సలహా ఇచ్చినట్లు ప్రచారం



**వాషింగ్టన్, ఆగస్ట్ 8 :** గత ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్య జాయింట్ చీఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ట్రంప్ వర్గానికి కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయటపడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం స్వల్పకాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసియలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా, ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు క్యాబినెట్ అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తోనూ చర్చలు జరిపారట. ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్.. దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే, సుదీర్ఘకాలంగా వైమానిక దాడులు చేపడుతుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతు న్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణులు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అయితే, వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. భారీ సంఖ్యలో ఫ్యాక్టరీలను రక్షణ రంగ కంపెనీలు నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, క్షిపణుల సంఖ్య గురించి మాత్రం ఆయన కచ్చితమైన లెక్క చెప్పకపోవడం గమనార్హం.



# సిఎన్‌జికి ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్

- దేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం
- ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8 :** దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్‌ను మిళితం చేసి వినియోగదారులకు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రివర్గం రూ.23,731 కోట్ల వ్యయంతో గోబర్ధన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, దిగుమతి చేసుకునే సహజ వాయువుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. గోబర్ధన్ అంటే సేంద్రియ గ్యాస్. ఈ పథకాన్ని 2027 నుంచి 2036 ఆర్థిక సంవత్సరాల మధ్య అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచడం, ఆ గ్యాస్‌ను సీఎన్‌జీ నెట్‌వర్క్‌లో వినియోగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను పశువుల పేడ, పంట అవశేషాలు, పురపాలక వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, చెరకు కర్మాగారాల వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. శుద్ధి పక్రియ అనంతరం ఈ గ్యాస్ రసాయనికంగా సహజ వాయువుకు చాలా దగ్గరగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే ఉన్న సీఎన్‌జీ, పీఎన్‌జీ పంపిణీ వ్యవస్థల ద్వారానే దీన్ని సరఫరా చేయవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిఎన్‌జి కార్ల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయో-గ్యాస్ రసాయనిక లక్షణాలు సహజ వాయువుకు సమానంగా ఉండటంతో వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ అవసరం ఉండదు. పెట్రోల్‌లో ఇ20 వినియోగానికి ప్రత్యేక ఇంజిన్ అవసరమైనట్లు గా విషయంలో అలాంటి నిబంధనలు ఉండవు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం నగర గ్యాస్ పంపిణీ సంస్థలకు బయోగ్యాస్ మిశ్రమం తప్పనిసరి కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం బయోగ్యాస్ మిశ్రమంతో ప్రారంభించి, 2027-28లో 4 శాతానికి, 2028-29 నుంచి 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుతో దేశీయంగా బయో-గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే దశాబ్దంలో బయోగ్యాస్ ఉత్పత్తి దాదాపు 10 రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో విదేశాల నుంచి సహజ వాయువు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, దేశ విదేశీ మారక వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ÷శింద్రీయ వ్యర్థాలను వినియోగించి ఇంధనం ఉత్పత్తి చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు పంట అవశేషాలు, పశువుల పేడ వంటి వనరుల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశాలు కూడా ఈ పథకం ద్వారా ఏర్పడనున్నాయి.

# లోయలో పడ్డ బొలెరో

## ఆరుగురు దుర్మరణం

**నైనిటాల్, ఆగస్ట్ 8 :** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్ ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# మంగాపురం వద్ద వాచ్‌మెన్ దారుణ హత్య

## ఇంట్లోకి దూరి గొంతు కోసిన దుండగులు

**చిత్తూరు, ఆగస్ట్ 8 :** చిత్తూరు రూరల్ మండలం మంగాపురం వద్ద దారుణ హత్య కలకలం రేపింది. ఎన్ఆర్ఐ పట్టాభి నాయుడు ఇంటి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆనందరావు (50)ను గుర్తుతెలియని దుండగులు కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఇంటి అద్దాలను నాటుబాంబుతో పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు.. వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిత్తూరు డీఎస్పీ వెంకటనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అసలు దుండగులు ఇంట్లోకి ఎందుకు చొరబడ్డారన్నది దర్యాప్తు చేస్తున్నారు. వాచ్‌మెన్ ఆనందరావును ఎందుకు హత్య చేయడం దొంగతనం కోసమే వచ్చారా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలను నిగ్గు తేల్చేందుకు ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ఇక నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

## 15న ప్రారంభించనున్న సిఎం

**నిజామాబాద్, ఆగస్ట్ 8 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికారులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్దం చేశారు.



# బాబాయి మృతిని తట్టుకోలేక అబ్బాయి ఆత్మహత్య

**ఒంగోలు, ఆగస్ట్ 8 :** ప్రకాశం జిల్లా కంభంలో తీవ్ర విషాదం ఘటన చోటుచేసుకుంది. బాబాయి మృతి చెందడాన్ని తట్టుకోలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాబాయి మణికుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న క్లైమ్ బాబు అనే యువకుడు.. తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధలోనే కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఒకే కుటుంబంలో వరుసగా ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మణికుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మణికుమార్ మృతి చెందారు. బాబాయి మృతి వార్త క్లైమ్ బాబును తీవ్రంగా కలిచివేసినట్లు తెలుస్తోంది. బాబాయితో ఉన్న అనుబంధం కారణంగా ఆయన మృతిని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన బాబు.. కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణికుమార్, లకైమ్ బాబు మృతదేహాలకు కుటుంబ సభ్యులు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి జరగడం చూసి స్థానికులు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన కంభం ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



## తొమ్మిది నెలల్లోనే ప్రపంచ టాప్-100లోకి తెలుగు బ్యాడ్మింటన్ జోడీ

### 12 అంతర్జాతీయ టోర్నీల్లో 5 పతకాలతో అరుదైన ఘనత

**శేరిలింగంపల్లి, ఆగస్టు 08(జనం వార్త):** తెలుగు బ్యాడ్మింటన్ క్రీడాకారులు అర్జున్ రెడ్డి పోచానా, అచ్యుతాదిత్య రావు దొడ్డవరపు జోడీ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుతూ సరికొత్త చరిత్ర సృష్టించింది. పురుషుల డబుల్స్ విభాగంలో జోడీగా తమ ప్రయాణాన్ని ప్రారంభించిన కేవలం తొమ్మిది నెలల్లోనే ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో టాప్-100లో స్థానం సంపాదించి అరుదైన ఘనత సాధించారు. శనివారం కొండాపూర్‌లోని ఏ జోన్ ఎలైట్ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అర్జున్ రెడ్డి, అచ్యుతాదిత్య రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ విజయ ప్రస్థానాన్ని వెల్లడించారు. భవిష్యత్తులో యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని, స్పాన్సర్ల సహకారంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. 2025 అక్టోబర్‌లో జోడీగా తమ ప్రయాణాన్ని ప్రారంభించిన తాము ఇప్పటివరకు 12 అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొని ఐదు పతకాలు సాధించామని తెలిపారు. ఇందులో ఒక స్వర్ణం, మూడు రజతాలు, ఒక కాంస్య పతకం ఉన్నాయి. మెక్సికో ఇంటర్నేషనల్‌లో స్వర్ణ పతకం సాధించగా, జాంబియా ఇంటర్నేషనల్, ట్రినిడాడ్ ఓపెన్, పెరూ ఇంటర్నేషనల్ టోర్నీల్లో రజత పతకాలు, సౌత్ ఆఫ్రికా ఇంటర్నేషనల్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నామని పేర్కొన్నారు. తాజాగా ముగిసిన కొరియా మాస్టర్స్-2026 ఫలితాల ఆధారంగా తమ జోడీ అధికారికంగా ప్రపంచ టాప్-100లో చోటు సంపాదించిందని తెలిపారు. తక్కువ సమయంలోనే ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరింత మెరుగైన ర్యాంక్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అర్జున్ రెడ్డి, అచ్యుతాదిత్య రావు తెలిపారు. తెలుగు క్రీడాకారులు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ వేదికపై అద్భుత ప్రతిభ కనబరుస్తూ ప్రపంచ టాప్-100లోకి ప్రవేశించడం పట్ల క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యువ క్రీడాకారులకు ఈ జోడీ విజయం స్ఫూర్తిదాయకమని పలువురు అభినందించారు.



## కొండాపూర్ జోయాలుక్కాస్‌లో ఘనంగా 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రారంభం

### రూ.1 లక్ష వజ్రాభరణాల కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం

**శేరిలింగంపల్లి, ఆగస్టు 08(జనం వార్త):** ప్రముఖ నగల సంస్థ జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో కొండాపూర్ బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఉన్న సిగ్నేచర్ టవర్స్ షోరూమ్‌లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆగస్టు 8 నుంచి 23వ తేదీ వరకు ఈ ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనలో వివాహ వేడుకలకు అనువైన అద్భుతమైన నగలు, నిత్యం ధరించేందుకు అనువైన ఆధునిక ఆభరణాలతో పాటు సంప్రదాయ, ఆధునిక శైలుల సమ్మేళనంతో రూపొందించిన ప్రత్యేక వజ్రాభరణాలను అందుబాటులో ఉంచారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా విభిన్న డిజైన్లలో వజ్రాభరణాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. రూ.1 లక్ష కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం: ప్రదర్శన సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించారు. ఆగస్టు 8 నుంచి 23వ తేదీ వరకు రూ.1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసే ప్రతి వినియోగదారునికి ఒక ఉచిత బంగారు నాణెం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ వజ్రాల శాశ్వత ఆకర్షణ, సృజనాత్మక నైపుణ్యానికి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పండుగల సీజన్‌లో వినియోగదారులకు అత్యుత్తమ డిజైన్లను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. పరిమిత కాలం మాత్రమే ఈ ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన అందుబాటులో ఉంటుందని షోరూమ్ ప్రతినిధులు తెలిపారు. నగరవాసులు, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## బడిలో బోనాల సందడి..

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన విద్యార్థులు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 8(జనం వార్త):** గోపన్‌పల్లి ఎన్టీఆర్ నగర్‌లోని నియో శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని విద్యార్థులకు పరిచయం చేసే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్, కరస్పాండెంట్ ఉమా, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పసుపు, కుంకుమ, నైవేద్యాలతో బోనం సిద్ధం చేసి అమ్మవారికి సమర్పించారు. తెలంగాణ పండుగల విశిష్టత, బోనాల పండుగ ప్రాశస్త్యాన్ని విద్యార్థులు తమ ప్రసంగాల ద్వారా వివరించారు. సంప్రదాయ వేషధారణలో పోతురాజులుగా విద్యార్థులు చేసిన విన్యాసాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ఆటపాటలు, సంప్రదాయ ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను భావితరాలకు పరిచయం చేసి, వాటి పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. అనంతరం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి విందులో పాల్గొని బోనాల వేడుకలను ఆనందోత్సాహాలతో ముగించారు.

## ఘనంగా సదానందగిరి స్వామి మండల ఆరాధన మహోత్సవం



**రాజాపేట, ఆగస్టు 8 (జనం వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం రఘునాథపురం రామస్వామి గుట్ట వద్ద శనివారం దశమి పర్వదినాన్ని పునస్కరించుకొని రామస్వామి గుట్ట వద్ద శ్రీ సదానందగిరి స్వామివారి మండల ఆరాధన మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా శ్రీ స్వామివారి శిష్యులు ఆలయ కమిటీ సభ్యుల భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ముందుగా శ్రీ స్వామివారి చిత్రపటానికి పూల మాలవేసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించి శ్రీమద్ భగవద్గీత పారాయణం శ్రీ స్వామివారి శిష్య బృందం భక్తుల చే గురుపూజ కార్యక్రమం, శ్రీ స్వామివారి మండల ఆరాధనకు వచ్చేసిన మహాత్ముల స్వామీజీల ఆధ్యాత్మిక సత్సంగ ఉపన్యాసలు ప్రవచనలు భక్తులను ఎంతో ఆకర్షించాయి భక్తులు ఈ సందర్భంగా శ్రీ సదానంద గిరి స్వామి వారు రామసామి గుట్ట ఆశ్రమానికి తీరని లోటు అని సదానందగిరి స్వామి రామస్వామి గుట్ట ఆశ్రమానికి గత 12 సంవత్సరాల నుండి పండుగలు పర్వదినాలలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల సహాయ సహకారాలతో యజ్ఞాలు హోమాలు మహాశివరాత్రికి శివ పార్వతుల కళ్యాణం శ్రీరామనవమికి శ్రీ సీతారాముల కళ్యాణం మరియు తొలి ఏకాదశి పర్వదినాలకు వారి సత్సంగ బోధనలు భజన కార్యక్రమాలు గణంగా నిర్వహించేవారు అని వారు రామస్వామి గుట్ట ఆశ్రమానికి తీరని లోటు అని ఈ సందర్భంగా భక్తులు వారిని గుర్తు చేసుకున్నారు అనంతరం శివరామకృష్ణ భజన మండలి శ్రీ వెంకటేశ్వర స్వామి భజన మండలి భక్త బృందాలచే భజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది అనంతరం నైవేద్య నివేదనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ మరియు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో రఘునాథపురం తో పాటు, కమటంగూడం, సాది వెల్లి,గౌరాయపల్లి ధర్మారెడ్డి గూడెం,చిన్న గౌరాయపల్లి, కాచారం గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఈ స్వామివారి శిష్యులు గ్రామ ప్రముఖులు వివిధ గ్రామాలనుంచి వచ్చేసిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## విజయదుర్గ భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

### మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 08(జనం వార్త):** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ప్రశాంతి నగర్‌లో శ్రీశ్రీశ్రీ విజయదుర్గ భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో రాగం నాగేందర్ యాదవ్ పాల్గొని భక్తులకు స్వయంగా అన్నదానం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌తో పాటు మురుగేష్, శ్రీనివాస్, సత్తి కుమార్, గోపాల్, ప్రణేష్, బాపునగర్ హనుమాన్ యూత్ అధ్యక్షుడు రాజకుమార్, సుధాకర్ రెడ్డి, కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, స్థానికవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండుగల తేదీలపై ఇక అయోమయం వద్దు!

### దృక్ సిద్ధాంత పంచాంగ కర్తల కీలక నిర్ణయం.. 2027-28, 2028-29 పండుగలపై ఏకగ్రీవ తీర్మానం



**హైదరాబాద్, ఆగస్టు 8 (జనం వార్త):** హిందూ పండుగలు, పర్వదినాల తేదీల విషయంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న భిన్నాభిప్రాయాలకు పరిష్కారం చూపేందుకు తెలంగాణ జ్యోతిష్య విజ్ఞాన సభ వేదికగా పంచాంగ కర్తలు కీలక నిర్ణయం తీసుకున్నారు. పండుగల తేదీలను శాస్త్రీయ, దృక్ సిద్ధాంత గణనల ఆధారంగా నిర్ణయించి ప్రజల్లో నెలకొంటున్న సందిగ్ధతను తొలగించాల్సిన అవసరాన్ని సభ స్పష్టం చేసింది. తెలంగాణ అర్చక సమాఖ్య, భాగ్యనగర అర్చక పురోహిత సంఘం, భారతీయ తెలుగు దృగ్గణిత పంచాంగ కర్తల సమాఖ్య సేవా సంఘం, శ్రీ చండీ పరమేశ్వరి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో తెలంగాణ జ్యోతిష్య విజ్ఞాన సభ నిర్వహించారు. డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ సిద్ధాంతి అధ్యక్షతన, శ్రీ గట్టు శ్రీనివాసాచార్యుల సమన్వయంతో సభ జరిగింది.

#### రెండు సంవత్సరాల పండుగలపై చర్చ

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దృక్ సిద్ధాంత పంచాంగ కర్తలు, సిద్ధాంతులు, జ్యోతిష్య పండితులు సభకు హాజరై ప్లవంగ నామ సంవత్సరం 2027-28, కీలక నామ సంవత్సరం 2028-29కు సంబంధించిన పండుగలు, పర్వదినాల నిర్ణయాలపై విస్తృతంగా చర్చించారు. తిథులు, పర్వకాల నిర్ణయాలు, పండుగల నిర్వహణకు సంబంధించిన అంశాలను శాస్త్రబద్ధంగా పరిశీలించిన అనంతరం రెండు సంవత్సరాలకు సంబంధించిన పండుగల నిర్ణయాలపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఒకే హిందూ పండుగకు సంబంధించి వేర్వేరు పంచాంగాల్లో రెండు తేదీలు వెలువడుతున్న పరిస్థితి కనిపిస్తోందని సభలో ప్రస్తావించారు. దీంతో ఏ రోజున పండుగ నిర్వహించాలన్న విషయంలో భక్తులు, అర్చకులు, ఆలయ నిర్వాహకులు, ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు అయోమయానికి గురవుతున్నాయని పంచాంగ కర్తలు పేర్కొన్నారు. ఒకే పండుగను రెండు వేర్వేరు రోజుల్లో నిర్వహించడం వల్ల భక్తుల్లో సందిగ్ధత ఏర్పడటమే కాకుండా ఆలయాల కార్యక్రమాల నిర్వహణ, ప్రభుత్వ సెలవుల నిర్ణయం, విద్యాసంస్థల క్యాలెండర్ వంటి అంశాల్లోనూ పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సభ అభిప్రాయపడింది. అందువల్ల పండుగల తేదీల విషయంలో శాస్త్రబద్ధమైన, స్పష్టమైన, ప్రజలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం ఉండాల్సిన అవసరాన్ని సభ నొక్కిచెప్పింది.

#### రాష్ట్రీయ పంచాంగం ప్రస్తావన

భారత ప్రభుత్వం 1953లో ఏర్పాటు చేసిన క్యాలెండర్ రిఫార్మ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రత్యక్ష గ్రహగతుల ఆధారంగా రాష్ట్రీయ పంచాంగం (చీఫ్‌ఆశీఖుశ్రీ ాఘుఅఎష్ట్రుఅస్త్ర) ప్రతి సంవత్సరం ప్రచురితమవుతోందని సభలో వివరించారు. ఈ పంచాంగం ప్రాంతీయ భాషల్లో కూడా అందుబాటులో ఉండటంతో పాటు రాష్ట్రాల దేవాదాయ, ధర్మాదాయ శాఖలకు అధికారికంగా పంపిణీ అవుతోందని పేర్కొన్నారు. దృక్ సిద్ధాంత పంచాంగాల రూపకల్పనలోనూ ప్రత్యక్ష గ్రహగతుల ఆధారంగా గణనలు చేస్తున్నామని పంచాంగ కర్తలు తెలిపారు. తమ పంచాంగాల్లో పేర్కొంటున్న పండుగల తేదీల నిర్ణయాలు భారత ప్రభుత్వ రాష్ట్రీయ పంచాంగంలోని నిర్ణయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాయని సభలో వెల్లడించారు.

#### ఏకాభిప్రాయంతో తీర్మానం

పండుగల తేదీల విషయంలో భవిష్యత్తులో ప్రజలకు మరింత స్పష్టత కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సభలో విస్తృత చర్చ జరిగింది. పంచాంగ కర్తలు, సిద్ధాంతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం రెండు సంవత్సరాలకు సంబంధించిన పండుగల నిర్ణయాలతో పాటు సభలో చర్చించిన అంశాలను సమగ్రంగా పొందుపరుస్తూ తీర్మానం రూపొందించారు. ఈ తీర్మానాన్ని సభలోనే తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ శ్రీ పొన్నాడ సుబ్రహ్మణ్యం గారికి, మాజీ మంత్రి శ్రీ వేణుగోపాలచారి గారికి అందజేశారు. పండుగల తేదీల విషయంలో ప్రజల్లో ఉన్న అయోమయాన్ని తొలగించి, ఆలయాలు, అర్చకులు, ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, భక్తులకు స్పష్టమైన మార్గదర్శకత్వం అందేలా చర్యలు తీసుకోవాలని సభ కోరింది.

#### పలువురు ప్రముఖుల హాజరు

సభకు శ్రీ వేణుగోపాలచారి, గౌరవ శ్రీ పొన్నాడ సుబ్రహ్మణ్యం, తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ గంగు ఉపేంద్రశర్మ, పరాశర రవీంద్రాచార్యులు, శ్రీ డీవీఆర్ శర్మ, పెన్నా మోహన్ శర్మ, సతీష్ శర్మ, సంతోష్ శాస్త్రి, శ్రీకాంత్ తదితరులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. అదేవిధంగా శ్రీ గొర్తి పట్టాభి సిద్ధాంతి, పీఎస్ఆర్ కృష్ణ, నిట్టల కృష్ణ ప్రసాద్, సీవీ అనంత, కర్ర వీరభద్రం, బిజుమల్ల శ్రీనివాస్ సిద్ధాంతి తదితర తెలుగు రాష్ట్రాల సిద్ధాంతులు, పంచాంగ కర్తలు సభలో పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పంచాంగ కర్తలు, జ్యోతిష్య పండితులు ఒకే వేదికపై సమావేశమై పండుగల తేదీలపై శాస్త్రబద్ధమైన చర్చ జరిపి రెండు సంవత్సరాలకు సంబంధించిన నిర్ణయాలను ఏకగ్రీవంగా ఆమోదించడం ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. భవిష్యత్తులో పండుగల తేదీల విషయంలో ప్రజల్లో గందరగోళం తగ్గి, ఒకే విధమైన స్పష్టమైన నిర్ణయాలు వెలువడేలా ఈ తీర్మానం దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

### మధ్యాహ్నం వేళ విద్యుత్ సరఫరా నిలిపివేత ..

### ఫోన్ చేసినా స్పందించని సిబ్బంది

**బిజినపల్లి వట్టెం , ఆగస్టు 8 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఇళ్లలో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారులు, చిన్నచిన్న దుకాణాల నిర్వాహకులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సమస్యపై సంబంధిత సిబ్బందికి ఫోన్ చేసినప్పటికీ కొందరు ఫోన్‌లు లిఫ్ట్ చేయడం లేదని, సమస్య పరిష్కారానికి సిబ్బంది సరైన సహకారం అందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లు పెద్దగా అవ్వడం వాళ్ళ వైర్లకు తాకడం చాలా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. విధ్యుత్ సిబ్బంది చెట్లను సగం తొలగించి సగం మిగిల్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ కోతలకు సంబంధించి ముందస్తు సమాచారం ఇవ్వాలని, తరచూ విద్యుత్ అంతరాయాలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.



## బోనకల్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**బోనకల్, ఆగస్టు 8 :** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు లక్ష్యంగా బోనకల్ మండల కేంద్రంలో పోలీసులు శనివారం విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, కీలక కూడళ్ల వద్ద వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులను గుర్తించి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో ప్రధానంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడం వంటి ఉల్లంఘనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.రహదారి భద్రత విషయంలో వాహనదారులు నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించడమే స్పెషల్ డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. వాహనదారులు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా యువత అతివేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

#### కొనసాగనున్న తనిఖీలు

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని బోనకల్ మండలంలో ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు, వాహన తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు. వాహనదారులు తమ వాహన పత్రాలను సక్రమంగా ఉంచుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో వైరా ఏసీపీ సారంగపాణి, సీఐ కొంగర మధు, బోనకల్ ఎస్ఐ మాచినేని రవితో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## హత్యకు గురైన న్యాయవాది మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన హై కోర్టు సీనియర్ కౌన్సిల్ రఘునాథ్

**నాగర్‌కర్నూల్,ఆగస్టు 8 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ పరిధిలోని పెంట్లవెల్లి గ్రామానికి చెందిన న్యాయవాది, ఆర్ఎంపీ వైద్యుడు బోగిని మల్లయ్య ఇటీవల దారుణ హత్యకు గురైన నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు డిజిగ్నెటెడ్ సీనియర్ కౌన్సిల్, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సభ్యులు శ్రీ వి. రఘునాథ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కొల్లాపూర్ బార్ అసోసియేషన్ సభ్యులు కురుమయ్య, నిరంజన్, నాగర్‌కర్నూల్ బార్ అసోసియేషన్ సభ్యులు బోనాసి రాంచందర్ తదితర న్యాయవాదులతో కలిసి రఘునాథ్ బాధిత కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ ఎదుట మల్లయ్య భార్య బోగిని మణెమ్మ ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. తన భర్తకు ప్రాణ-హాని ఉందని హత్యకు ముందే పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోలేదని మణెమ్మ ఆరోపించారు. గతంలోనూ ఇదే వ్యక్తులు తన భర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని, ఆ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు. హత్యకు కొద్ది రోజుల ముందు కూడా సహచర న్యాయవాదులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ రక్షణ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన నిందితులను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల వద్ద ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అవసరమైన వనరులు ఉన్నప్పటికీ నిందితుల అరెస్టు ఆలస్యం కావడానికి రాజకీయ ఒత్తిళ్లే కారణమని ఆరోపించారు. తమ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, జిల్లా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.




## డీప్‌ఫేక్ వీడియోలపై చర్యలు తీసుకోండి

### మెటాకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8 :** సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో డీప్‌ఫేక్ వీడియోలు.. బాలలపై లైంగిక వేధింపుల మెటీరియల్‌పై 'మెటా' ప్రతినిధుల బృందంతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపింది. ఇందులో భాగంగా డీప్‌ఫేక్ వీడియోలపై చర్యలు తీసుకోవాని మెటాను కేంద్రం ఆదేశించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఉండే కంటెంట్‌కు ఆయా సంస్థలే బాధ్యత వహించాలని పేర్కొంది. భారత చట్టాలకనుగుణంగా మెటా మాధ్యమాలు ఎంత మేరకు నడుచుకుంటున్నాయన్నదానిపై అధికారులు ఆ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ రికమండేషన్ అల్గోరిథమ్‌ల గురించి ఆరా తీశారు. కంపెనీ ప్రతినిధులతో జరిపిన సమావేశాల ఫలితాలను సమీక్షించిన తర్వాత తదుపరి చర్యలపై కార్యాచరణను ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కూడా స్థానిక చట్టాలను పాటిస్తున్నాయా లేదా అనే విషయాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. చర్చల్లో భాగంగా.. తమ ప్లాట్‌ఫామ్‌లలోని డీప్‌ఫేక్‌లపై కేంద్రం వ్యక్తం చేసిన ఆందోళనలపై మెటా స్పందించింది. అటువంటి కంటెంట్‌ను నిలిపివేసేందుకు తమ వద్ద పలు పరిష్కారాలు ఉన్నాయని తెలిపింది. ప్రధాని మోదీ విడుదల చేసిన ఓ వీడియో సందేశాన్ని ఫేస్‌బుక్ కొన్ని గంటల పాటు నిలిపివేసినందుకు సమన్లు జారీ చేయడంతో దాని మాతృసంస్థ 'మెటా' ప్రతినిధుల బృందం భారత్‌కు విచ్చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలోని ఇతర కంటెంట్‌పైనా కేంద్ర ప్రభుత్వం వారితో చర్చలు జరుపుతోంది. మెటా ప్రపంచ వ్యవహారాల హెడ్ జోయెల్ కప్లన్ నేతృత్వంలోని బృందంతో.. కేంద్ర ఐటీమంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా పలువురు అధికారులు చర్చిస్తున్నారు.

## ఈనెలలోనే అమరావతికి సంబంధించి రెండు కీలక ప్రారంభాలు : చంద్రబాబు

**అమరావతి:** చట్ట వ్యతిరేకంగా ఏం చేసినా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టేలా బస్టాండ్‌లు, రహదారుల వెంట నిరసనలు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టంచేశారు. గొడ్డలి పార్టీ నిరసనల్లో రౌడీలు, గంజాయ్ బ్యాచ్‌లు తప్ప ఒక్కరైనా డీఎస్సీ అభ్యర్థులు ఉంటున్నారా అని మండిపడ్డారు. కర్నూలులో ఇవాళ కదం తొక్కిన వారంతా మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయ-ులేనని తెలిపారు. గొడ్డలి పార్టీ చేసే నష్టం వల్ల.. ఉపాధ్యాయులు ఐక్యంగా తమ ఆత్మగౌరవం చాటారని సీఎం అన్నారు

## కన్నకూతురుపైనే కామాంధుడి లైంగిక దాడి

### కూతురు ఫిర్యాదుతో పోలీసుల అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్ట్ 8 :** కన్న తండ్రి క్రూర మృగంలా మారాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వాడే పశువులా మారిపోయాడు. కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ అమానీవయ ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు(45) తన భార్య ముగ్గురు కూతుళ్లతో కలిసి సనత్‌నగర్‌లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ భార్యా బిడ్డలతో గొడవలు పెట్టుకునేవాడని సమాచారం. కాగా, మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి తన రెండో కూతురిపై కన్నేసి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబం పరువు పోతుందని విషయం బయటకు రాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. కానీ తండ్రి అరాచకాలు ఆగకపోవడంతో, ఓపిక నశించిన బాలిక సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో బాలిక తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

## ఫీజు కోసం వేధింపులు.. విద్యార్థి ఆత్మహత్య

**కాకినాడ, ఆగస్ట్ 8 :** స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల సిబ్బంది వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ జగన్నాథపురంలోని జె.రామారావుపేట సమ్మెటవారి వీధికి చెందిన పైలా రాంబాబు, జ్యోతి దంపతుల రెండో కుమారుడు పైలా అరవింద్(15) స్థానికంగా ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. శుక్రవారం అరవింద్, అతడి తండ్రి మొదటి టర్మ్ ఫీజు కట్టేందుకు కళాశాలకు వెళ్లినప్పుడు.. చాలామంది సెకండ్ టర్మ్ కూడా కట్టేశారని, మీరు ఇంకా మొదటి టర్మ్ ఫీజే కట్టలేదని సిబ్బంది అనడంతో వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అరవింద్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## చనిపోయిన ఏడాది తరవాత అస్తిపంజరం గుర్తింపు

### ఒంటరి మహిళ మృతిని గుర్తించని బంధువులు

**బెంగళూరు, ఆగస్ట్ 8 :** ఓ డూప్లెక్స్ ఇంట్లో మహిళ అస్థిపంజరం వెలుగుచూసిన సంఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని బాగలగుంటే ఏరియాకు చెందిన 52 ఏళ్ల దాక్షాయణి హావనూర్ లేఅవుట్‌లోని డూప్లెక్స్ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె భర్త ఉమేష్ 10 సంవత్సరాల క్రితం యాక్సిడెంట్‌లో చనిపోయాడు. కుమారుడు క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోయాడు. దాక్షాయణికి ఓ కూతురు ఉంది. ఆమెకు చాలా కాలం క్రితమే పె÷-లళైంది. ఒంటరిగా ఉంటున్న దాక్షాయణి సంవత్సరం క్రితం చనిపోయింది. ఈ ఏడాది కాలంలో కూతురు, అల్లుడు ఆ ఇంటికి రాకపోవటంతో దాక్షాయణి చనిపోయిన సంగతి బయటపడలేదు. సమాచారం అందుకున్న బాగలగుంటే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆస్థిపంజరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ మరణానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునే పనిలో పడ్డారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.





# నాగారంలో ఘనంగా కాటమయ్యకు బోనాలు

### నిష్టతో బోనం సమర్పించిన గౌడ కులస్తులు

**నాగారం,ఆగస్టు 8(జనం వార్త) :** శ్రీ కంఠమహేశ్వర స్వామికి నియమనిష్టలతో బోనం ఎక్కిస్తే సర్వ శుభాలు కలుగుతాయని ఆలయ గౌరవ అధ్యక్షులు గూడూరు పెంటయ్య గౌడ్,ఆలయ చైర్మన్ సుర్వి యాదగిరి గౌడ్ అన్నారు.నాగారం డివిజన్ పరిధిలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో శనివారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామికి త్రికరణ శుద్ధితో బోనం సమర్పించారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బిజ్జ సత్తయ్య గౌడ్,రామగోని శ్రీనివాస్ గౌడ్,పబ్బతి బిక్షపతి గౌడ్,గూడూరు ప్రభాకర్ గౌడ్,సుర్వి బాబుగౌడ్, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్,గూడూరు చక్రపాణి గౌడ్,సుర్వి వీరేశం గౌడ్,మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్,గూడూరు కృష్ణగౌడ్, బిజ్జా దశరథ గౌడ్, గూడూరు శ్రీనివాస్ గౌడ్, గూడూరు ఆంజనేయులు గౌడ్,నక్క కిషోర్ గౌడ్, గూడూరు రమేష్ గౌడ్, సుర్వి శ్రీనివాస్ గౌడ్, చిన్నంరాజు సతీష్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, గూడూరు రమేష్ గౌడ్,కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు గూడూరు మహేష్ గౌడ్,బిజ్జ శ్రీనివాస్ గౌడ్,గూడూరు సతీష్ గౌడ్,గూడూరు అవినాష్ గౌడ్,గూడూరు నితీష్ గౌడ్,గూడూరు కౌశిక్ గౌడ్,గౌడ కులస్తుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత్‌పై 100శాతం టారిఫ్‌ల భారం

### బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం



**వాషింగ్టన్, ఆగస్ట్ 8 :** భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ట్రంప్ మళ్లీ టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు ముందడుగు పడింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా సెనెట్ తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఇటీవల మృతిచెందిన సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా, ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ 86-11తో ఆమోదించింది. ఆగస్టు 31న ఈ బిల్లు ప్రతినిధుల సభ ముందుకు రానుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత అమెరికా అధ్యక్షుడి సంతకంతో ఇది చట్టరూపం దాల్చనుంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే భారత్‌పై 100శాతం సుంకాలను విధించనున్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకొనే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది. ఇది అమల్లోకి వస్తే భారత్, చైనా, స్లొవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ వంటి దేశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. గతంలో ఈ టారిఫ్‌లు 500శాతం వరకు ఉండాలని ట్రంప్ సర్కార్ ప్రతిపాదించింది. ఆ తర్వాత పశ్చిమాసియా ఉద్రిక్తతలు వంటి అంతర్జాతీయ పరిణామాలతో సుంకాల పరిమితిని సవరించి 100 శాతానికి తగ్గించారు.

# మహిళా బిల్లుపై మాటల యుద్ధం

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8 :** మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు. దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ.. 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. 'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం బాగా ఎవరికి తెలుస్తుంది? మహిళా రిజర్వేషన్ చట్టం-2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది. అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు?' అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల



చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయి-ులో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

## మహిళా ఎస్ఐ పట్ల అసభ్య ప్రవర్తన

### వైకాపా నేత చింతాడ రవి కోసం గాలింపు

**శ్రీకాకుళం, ఆగస్ట్ 8 :** జిల్లాలోని ఆమదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రవి కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పోలీసులు గాలిస్తున్నారు. మహిళా ఎస్ఐపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో రవికుమార్ పరారీలో ఉన్నారు. ఇటీవల వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆముదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జి చింతాడ రవి.. మహిళా ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించారంటూ ఓ వీడియో బయటకు వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ నేత సహా 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రవి ఏ1గా ఉన్నారు. జగన్ పర్యటన అనంతరం గత పది రోజులుగా అరెస్ట్ భయంతో వైసీపీ నేతతోపాటు అనుచరులంతా అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. రవిని అరెస్ట్ చేసేందుకు విస్తృతంగా గాలిస్తున్నారు. నిన్నటి నుంచి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి వైసీపీ నేత ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 21 మందిలో నిన్న రాత్రి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేశారనే ఉద్దేశంతో రవితో పాటు 21 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో వైసీపీ నేతను ఏ క్షణంలో అయినా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## వివేకా హత్యకేసు విచారణలో అవకతవకలు

### మరోమారు వైఎస్ సునీత ఆరోపణలు

**కడప, ఆగస్ట్ 8 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కుమార్తె వైఎస్ సునీతా రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసు విచారణలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. శనివారం వైఎస్ వివేకా 75వ జయంతి సందర్భంగా పులివెందుల్లోని వివేకా సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం సునీత మీడియాతో మాట్లాడుతూ.. 'నా తండ్రి వివేక హత్య కేసు విషయంలో గత ఆరునెలల కాలంగా జడ్జిమెంట్లు కూడా సరిగా లేవని నా అభిప్రాయం. విచారణలో అవకతవకలు ఉండడం వల్లే ఇన్నిసార్లు కోర్టుమెట్లు ఎక్కాల్సి వచ్చింది' అని చెప్పుకొచ్చారు. ఏదో ఒకరోజు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో పోరాటం కొనసాగిస్తూనే ఉంటానని సునీత అన్నారు. వివేక హత్య జరిగిందని అందరికంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే తెలుసు అని సునీత పేర్కొన్నారు.

## గూఢచర్యం కేసులో పోలీసుల అదుపుతో వింగ్ కమాండర్

- హనీట్రాప్‌తో లోబర్చుకున్న పాక్ మహిళ
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

**న్యూఢిల్లీ,ఆగస్ట్8 :** పాక్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డ భారత ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం మే నెలలోనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదంతం వెనుక భారీ గూఢచర్య నెట్‌వర్క్ ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్ నిఘా ఆఫీసర్లు పన్నిన హనీట్రాప్‌లో వింగ్ కమాండర్ పడ్డాడని చెప్పాయి. నిందితుడిపై అప్పటికే కొంతకాలంగా నిఘా పెట్టి ఆపై పోలీసులకు సమాచారం అందించామని ఎయిర్‌ఫోర్స్ ప్రతినిధి తెలిపారు. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న వింగ్ కమాండర్ హనీట్రాప్‌లో పడ్డట్టు పోలీసులు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో పరిచయ-ుమైన ఒక మహిళ అతడి పరిస్థితిని ఆసరాగా చేసుకుని గుఢచర్యానికి ఉసిగొల్పింది. 'చాటింగ్‌తో వాళ్ల పరిచయం మొదలైంది. ఆ తరువాత వీడియో కాల్స్ చేసుకున్నారు. అతడికి నమ్మకం కలిగించాక ఆమె మిలిటరీ కదలికల సమాచారం, ఫొటోలను కోరిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మహిళ కోరిక మేరకు కీలకమైన సమాచారం, డాక్యుమెంట్స్‌ను వింగ్ కమాండర్ డిజిటల్ మాధ్యమాల ద్వారా షేర్ చేశాడు. ఆ తరువాత ఆమె సూచనలతో అతడు తన సహోద్యోగి ఫోన్‌లో స్పైవేర్ కూడా ఇన్‌స్టాల్ చేశాడు. రిమోట్‌గా డివైజ్‌లోని సమాచారాన్ని తస్కరించేందుకు, లోకేషన్ డేటాను తెలుసుకునేందుకు, ఫోన్ కాల్స్‌ను వినేలా స్పైవేర్‌ను డిజైన్ చేశారు. పాక్‌లోని హ్యాండ్లర్ల సూచనల ప్రకారం మహిళ ఆ వింగ్ కమాండర్‌ను ఉచ్చులోకి దింపినట్టు గుర్తించారు. ఇక శత్రుమూకలకు చేరిన సమాచారంతో ముప్పు ఎంత ఉందనేది విశ్లేషిస్తున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. రక్షణ రంగానికి చెందిన సీక్రెట్ సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉద్దేశించిన పాక్ నిఘా నెట్‌వర్క్‌లో మహిళ భాగమైన ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తు న్నారు. మహిళకు మార్గనిర్దేశనం చేస్తున్న విదేశీ హ్యాండర్లు ఎవరో తెలుసుకు నేందుకు ప్రయత్నిస్తున్నామని సంబంధిత వర్గాలు తెలిపాయి.




## 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది.

## రామాయణ తొలుత విదేశాల్లో విడుదల

రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.




## 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




## కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణేష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.



## గోల్డెన్ లెగ్‌గా రితికా నాయక్

యంగ్ అండ్ క్యూట్ బ్యూటీ రితికా నాయక్.. 'కొరియన్ కనకరాజు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ అందుకుంది. ఈ సినిమాలో రితిక తన నటనతో, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆడియన్స్ నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఒకవైపు మెస్మరైజ్ చేసే గ్లామర్, మరోవైపు పాత్రలో లీనమయ్యే పర్ఫార్మెన్స్‌తో మ్యాజిక్ చేస్తున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన 'మిరాయ్' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన ఈ అమ్మడు.. బాక్సాఫీస్ వద్ద సూపర్ సక్సెస్ అందుకుంది. ఇప్పుడు వరుణ్ తేజ్ నటించిన 'కొరియన్ కనకరాజు' చిత్రంతో వచ్చిన మరో హిట్ తన ఖాతాలో వేసుకుంది. ఇలా బాక్సాఫీస్ వద్ద వరుస హిట్స్ అందుకోవడంతో టాలీవుడ్‌లో రితికా నాయక్ క్రేజ్ పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో టాలీవుడ్ దర్శకనిర్మాతలు ఈ అమ్మడును లక్కీ చార్మ్‌గా భావిస్తూ.. తమ ప్రాజెక్టుల కోసం రితికాను ఫిక్స్ చేయాలని చూస్తున్నారట. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన వార్తలు వైరల్ అవుతుండగా.. ట్లాలీవుడ్ గోల్డెన్ లెగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్.



## త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది

### సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు. త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.



# మళ్లీ బంగారం ధరల పరుగు

**హైదరాబాద్, ఆగస్ట్ 8 :** గత కొద్దిరోజుల నుంచి బంగారం ధరలు మళ్లీ వరుసగా పెరుగుతూ పోతున్నాయి. కూడా బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1090 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 1000 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 820 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,52,350 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,39,650 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,14,260 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.








## యూపీఐపై ఛార్జీలు ఉండవు : ఫోన్‌పే

యూపీఐ లావాదేవీలపై ఛార్జీల వసూలుకు సంబంధించిన బిల్లు లోక్‌సభలో ఆమోదంతో పొందడంతో.. డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సాధారణ వినియోగదారుల్లో ఛార్జీల ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఫోన్‌పే వ్యవస్థపాకుడు, సీఈవో సమీర్ నిగమ్ కీలక ప్రకటన చేశారు. యూపీఐ లావాదేవీలపై భారతీయ వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. భారతీయ యూజర్లకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే ఉంటాయని, డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని నిగమ్ స్పష్టం చేశారు. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం- 2007 సవరణ బిల్లును లోక్‌సభలో ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే ఈ సవరణల వల్ల ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల బ్యాంకు ఖాతాలకు యూపీఐ ద్వారా పంపే వ్యక్తిగత నగదు లావాదేవీలకూ ఛార్జీలు వర్తించవు. రూ.1.5 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగి ఉండే షాపింగ్ మాల్స్, కార్పొరేట్ సూపర్ మార్కెట్లు, లగ్జరీ హోటళ్ల వంటి వాటిల్లో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన చెల్లింపులపైనే ఎండీఆర్ ఛార్జీలు విధించే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే భవిష్యత్తులో ఇతర లావాదేవీలకూ ఈ ఛార్జీలు వర్తింపజేస్తారన్న భయాలు ప్రజల్లో నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఫోన్‌పే సీఈవో ప్రకటన కీలకంగా మారింది.

# శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్

### రెండో రోజు ముగిసిన ఆట

**కొలంబో:** శ్రీలంక క్రికెట్ ఎలెవన్, భారత్ మధ్య జరుగుతున్న మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌ను శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేయగా.. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా శనివారం ఆట ముగిసే సమయానికి 357/6 స్కోరుతో నిలిచింది. భారత్ ఇంకా ఆరు పరుగుల వెనుకంజలో ఉంది. దేవదత్ పడిక్కల్ (142; 137 బంతుల్లో 14 ఫోర్లు) శతకంతో ఆకట్టుకున్నాడు. పడిక్కల్‌తోపాటు గుర్నూర్ బ్రార్ (36; 18 బంతుల్లో) క్రీజులో ఉన్నాడు. నాలుగో స్థానంలో వచ్చిన రవీంద్ర జడేజా (63 రిటైర్డ్ హర్ట్; 117 బంతుల్లో) రాణించగా.. కేఎల్ రాహుల్ (40; 67 బంతుల్లో), మానవ్ సుతార్ (41; 90 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. సరాంశ్ జైన్ (22) రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. యశస్వి జైస్వాల్ ఎదుర్కొన్న రెండో బంతికే డకౌట్‌గా వెనుదిరగ్గా.. రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఆట చివర్లో గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్‌లో నాలుగు సిక్స్‌లు బాదేశాడు. శ్రీలంక బౌలర్లలో రమేశ్ మెండిస్ 2, అసంక మనోజ్ 2, కేసర నువాంత, విశ్వ ఫెర్నాండో ఒక్కో వికెట్ పడగొట్టారు.



### సాయి సుదర్శన్ ఔట్.. పోటీలో ముగ్గురు..

శ్రీలంకతో రెండు టెస్టుల ముంగిట టీమ్‌ఇండియాను గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ గాయాల కారణంగా సిరీస్‌కు దూరమయ్యారు. తాజాగా సాయి సుదర్శన్ కూడా శ్రీలంకతో మ్యాచ్‌లకు అందుబాటులో లేకుండా పోయాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్న సుదర్శన్ కాలి వేలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని సిరీస్‌ను నుంచి తప్పించారు. సుదర్శన్ స్థానంలో త్వరలో మరొకరిని సెలక్టర్లు ఎంపిక చేయనున్నారు. సర్ఫరాజ్ ఖాన్, రుతురాజ్ గైక్వాడ్, రజత్ పటిదార్ ప్రధానంగా రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఈ ముగ్గురూ ఆగస్టు 23 నుంచి ప్రారంభంకానున్న దులీప్ ట్రోఫీకి సిద్ధమవుతున్నారు. రుతురాజ్ వెస్ట్‌జోన్ కెప్టెన్‌గా ఉండగా.. అదే జట్టుకు సర్ఫరాజ్ ఆడనున్నాడు. ఇక, మధ్యప్రదేశ్ బ్యాటర్ రజత్ పటిదార్ సెంట్రల్ జోన్‌కు సారథ్యం వహించనున్నాడు. ఈ ముగ్గురిలో ఒకరికి కచ్చితంగా భారత జట్టు నుంచి పిలుపు వచ్చే అవకాశముందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## జియో కొత్త ప్లాన్లు..

### 15 ప్రీమియం ఓటీటీ యాప్‌లు ఫ్రీ

ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో తన ఓటీటీ పాస్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. ఇప్పటికే 28 రోజుల వ్యాలిడిటీతో రూ.200 పాస్‌ను అందిస్తుండగా.. కొత్తగా 3 నెలలు, ఏడాది వ్యాలిడిటితో కొత్త పాస్‌లను ప్రవేశపెట్టింది. రూ.550, రూ.2 వేలతో జియో ఓటీటీ పాస్‌లను తీసుకొచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్ కోరుకునే వినియోగదారులే లక్ష్యంగా, దీర్ఘకాల సబ్‌స్క్రిప్షన్ కోసం ఈ పాస్‌లను లాంచ్ చేసింది. ఆగస్టు 7 నుంచే ప్లాన్లు అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. రూ.550 ఓటీటీ పాస్ వివరాలు.. 84 రోజుల వ్యాలిడిటీ, 90 జీబీ హైస్పీడ్ డేటాతో ప్లాన్ వస్తుంది. అపరిమిత 5జీ ఉంటుంది. వాయిస్ కాల్స్ ఉండవు. మూడు నెలలు, ఏడాది బేస్ ప్లాన్‌తో జియో సబ్‌స్క్రైబర్లకు అందుబాటులో ఉంది. రూ.2వేల ఓటీటీ పాస్.. 365 రోజుల వ్యాలిడిటీ, 365 జీబీ హైస్పీడ్‌డేటాతో ప్లాన్ తీసుకొచ్చారు. అపరిమిత 5జీ ఉంది. ఏడాది బేస్ ప్లాన్ మాత్రమే అందుబాటులో ఉంది. వాయిస్‌కాల్స్ ఉండవు. 15 ప్రీమియం ఓటీటీ యాప్‌లు, జియో టీవీలో వెయ్యికి పైగా ఛానెళ్లు వీక్షించొచ్చు. ఈ ప్లాన్‌ల ద్వారా రూ.1500 విలువైన నెలవారీ ప్రయోజనాలను పొందొచ్చని జియో వెల్లడించింది. ఈ ప్యాక్ ద్వారా వినియోగదారులు టీవీ, టాబ్లెట్, మొబైల్ పరికరాల్లో ప్రకటనలు లేకుండా, బ్యాక్ గ్రౌండ్‌ప్లే చేస్తూ యూట్యూబ్ ప్రీమియంను యాక్సెస్ చేయొచ్చు. దీంతో పాటు లైవ్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఒరిజినల్స్, బ్లాక్‌బస్టర్ హాలీవుడ్ కంటెంట్‌తో జియోహాట్‌స్టార్ మొబైల్‌ం హాలీవుడ్ యాక్సెస్‌ను అందిస్తున్నారు. కొత్త పాస్‌ల ద్వారా అమెజాన్ ప్రైమ్ లైట్ మెంబర్‌షిప్‌తో ప్రైమ్ వీడియో స్ట్రీమింగ్ యాక్సెస్ చేయొచ్చు. గతంలో తీసుకొచ్చిన రూ.200 పాస్‌తో అమెజాన్ ప్రైమ్ వీడియో మొబైల్ ఎడిషన్ అందుబాటులో ఉంది. జియో టీవీ ద్వారా సోనీలివ్, జీ5, లయన్స్‌గేట్ ప్లే, డిస్కవరీ ప్లస్, సన్‌నెక్స్ట్, ఫ్యాన్‌కోడ్ వంటి మరో 12 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను యాక్సెస్ చేయొచ్చు. స్టార్ ప్లస్ హెచ్‌డీ, కలర్స్ హెచ్‌డీ, సన్ టీవీ హెచ్‌డీ, కార్టూన్ నెట్‌వర్క్ వంటి ప్రముఖ బ్రాడ్‌కాస్ట్ ఛానెల్స్‌ను లైవ్‌గా వీక్షించొచ్చు. మైజియో యాప్, జియో.కామ్ వెబ్‌సైట్, థర్డ్‌పార్టీ రీఛార్జి యాప్‌లలో ఈ ప్లాన్ అన్ని టెలికాం సర్కిల్స్‌లో అందుబాటులో ఉందని కంపెనీ తెలిపింది.



## లంక బౌలర్లను అలాగే ఆడాలి : రహానె

శ్రీలంకతో జరగబోయే రెండు టెస్టుల సిరీస్‌లో భారత బ్యాటర్లు దూకుడుగానే ఆడాలని మాజీ క్రికెటర్ అజింక్య రహానె సూచించాడు. ఆగస్టు 15న మొదలయ్యే సిరీస్‌లో మన బ్యాటర్లు ఆత్మరక్షణకు పోతే అసలుకే మోసం వస్తుందని అతను అభిప్రాయపడ్డాడు. "శ్రీలంకలో తొలి రోజు పిచ్ చాలా బాగుంటుంది. బ్యాటర్లు ఎప్పుడూ బౌలర్లపై పైచేయిలోనే ఉండాలి. లంకలో నేను నేర్చుకున్నది ఇదే. రక్షణాత్మకంగా ఉంటే కష్టం. అక్కడ వికెట్లు స్పిన్నర్లకు సహకరిస్తాయి. శ్రీలంకకు ఎప్పుడూ మెరుగైన స్పిన్నర్లు అందుబాటులో ఉంటారు. ఏ జట్టునైనా దాని సొంతగడ్డపై ఓడించడం కష్టం. ఎవరినీ తేలిగ్గా తీసుకోకూడదు. అక్కడ సానుకూల దృక్పథంతో ఆడితేనే ప్రయోజనం ఉంటుంది. టెస్టుల్లో కూడా ఈ శైలే ఉపకరిస్తుంది. ప్రతి బ్యాటర్ తనకు తాను ఒక ప్రణాళికతో బరిలోకి దిగాలి" అని రహానె అన్నాడు. బెంగళూరు: ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కూ రిటైర్మెంట్ ప్రకటించిన టీమ్‌ఇండియా సీనియర్ బ్యాటర్ అజింక్య రహానె.. తొలిసారిగా విదేశీ లీగ్ ఆడబోతున్నాడు. ఈ ఏడాదే మొదలవుతున్న యూరోపియన్ టీ20 ప్రిమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్‌కు రహానె ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ లీగ్‌లో తొలి సీజన్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 20 వరకు జరగనుంది. ఐర్లాండ్‌లోని డబ్లిన్, నెదర్లాండ్స్‌లోని హాగ్ నగరాల్లో ఈటీపీఎల్ మ్యాచ్‌లు ఉంటాయి. ఆరు జట్లు తలపడే ఈ టోర్నీలో డబ్లిన్ గార్డియన్స్ ఫ్రాంఛైజీకి భారత దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ యజమాని కావడం విశేషం. ఇందులో స్టీవ్, మాథ్యూ హేడెన్ లాంటి దిగ్గజాలకు కూడా జట్లు ఉన్నాయి. గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఒక ఫ్రాంఛైజీలో భాగస్వామి కాగా.. మరో జట్టుకు జాంటీ రోడ్స్, డుప్లెసిస్, హెన్రిచ్ క్లాసెన్ యజమానులు.

# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్..

### ప్రపంచంలో తొలి స్పిన్నర్‌గా రికార్డు

అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో మూడుసార్లు ఆరు వికెట్ల ప్రదర్శన చేసిన తొలి స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. బ్రెడీ క్రికెట్ క్లబ్ వేదికగా ఐర్లాండ్‌తో శుక్రవారం రాత్రి జరిగిన రెండో వన్డేలో రషీద్ ఖాన్ (6/34) అదరగొట్టి ఈ ఘనత అందుకున్నాడు. అంతకుముందు మార్చి 17, 2017న గ్రేటర్ నోయిడాలో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అఫ్గాన్ స్పిన్నర్ 9.3 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అలాగే, జూన్ 9, 2017న గ్రోస్ ఐస్లెట్‌లో వెస్టిండీస్‌పై 8.4 ఓవర్లలో 18 పరుగులే ఇచ్చి ఏకంగా ఏడు వికెట్లు తీశాడు. స్పిన్నర్లయిన అజంత మెండిస్ (శ్రీలంక), వానిందు హసరంగ (శ్రీలంక), ఇమ్రాన్ తాహిర్ (సౌతాఫ్రికా), షాహిద్ అఫ్రిది (పాకిస్థాన్), అకిల ధనంజయ (శ్రీలంక), సందీప్ లామిచానే (నేపాల్) వన్డేల్లో రెండేసిసార్లు ఆరు వికెట్ల ప్రదర్శన చేశారు. ఇప్పుడు వీరందరిని అధిగమించిన రషీద్ ఖాన్ కొత్త సృష్టించాడు. ఇక ఓవరాల్‌గా వన్డేల్లో అత్యధికసార్లు ఆరు వికెట్లు తీసిన రికార్డు పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ వకార్ యూనిస్ పేరిట ఉంది. అతడు తన కెరీర్‌లో మొత్తం ఐదుసార్లు ఆరు లేదా అంతకంటే వికెట్లు పడగొట్టాడు. అతడి అత్యుత్తమ ప్రదర్శన (7/36).



## వైభవ్ సూర్యవంశీ స్పెషాలిటీ ఏంటి?

### సింపుల్‌గా చెప్పేసిన శిఖర్ ధావన్



చిన్న వయసులోనే పరిణతితో ఆడటం సాధారణ విషయం కాదని.. వైభవ్ సూర్యవంశీ చాలా స్పెషల్ అని మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసించాడు. స్ట్రోక్ ప్లేతోపాటు నిర్భయంగా ఆడే మనస్తత్వం అతడి సొంతమని తెలిపాడు. 15 ఏళ్ల వయసులోనే స్టార్ బౌలర్లపైనా ఆధిపత్యం ప్రదర్శించడం అద్భుతమన్నాడు. "కేవలం దూకుడుగా ఆడటంతోనే వైభవ్ సూర్యవంశీ హైలైట్ కావడం లేదు. అతడిలో మరో ప్రత్యేకత కూడా ఉంది. ఎలాంటి షాట్‌నైనా మనసు పెట్టి ఆడతాడు. నైపుణ్యంతోపాటు ఇలాంటి అలవాటు ఉంటే అతడిని ఆపడం చాలా కష్టం. పిన్న వయసులోనే ఆ సత్తాను అందుకోవడం అభినందనీయం. అంతర్జాతీయ క్రికెట్‌లో 15 ఏళ్లకు అడుగు పెట్టడమే అతడు సాధించిన అతిపెద్ద ఘనత. ఐపీఎల్‌లోనూ ఫోర్లు, సిక్స్‌లు చాలా దూకుడుగా బాదేవాడు. ముమ్మందు కూడా అతడి భవిష్యత్తు అద్భుతంగా ఉండబోతోంది" అని ధావన్ తెలిపాడు.



## జావెలిన్ త్రో.. పదేళ్ల తర్వాత భారత్‌కు రెండో పతకం

భారత యువ అథ్లెట్ ఆశిశ్ యాదవ్ అద్భుతం చేశాడు. వరల్డ్ 20 ఛాంపియన్‌షిప్స్ జావెలిన్ త్రో విభాగంలో రజతం సాధించాడు. పదేళ్ల కిందట నీరజ్ చోప్రా ఇదే ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు. ఆ తర్వాత ఇప్పుడు ఆశిశ్ పతకం సొంతం చేసుకుని రెండో భారత అథ్లెట్‌గా ఘనత సాధించాడు. ఈ 19 ఏళ్ల యువ అథ్లెట్ గట్టిపోటీ ఉన్నా మెరుగైన ప్రదర్శనే చేశాడు. దక్షిణాఫ్రికా అథ్లెట్ జాన్ హెడ్రిక్ హైమన్స్ 80.50 మీటర్ల దూరం విసిరి స్వర్ణం దక్కించుకున్నాడు. ఆశిశ్ 74.09 మీ.తో రెండో స్థానంలో నిలిచి రజతం సాధించాడు. డొమినికాకు చెందిన అడ్డిసన్ జేమ్స్ (73.89 మీ) మూడో స్థానంతో కాంస్యం అందుకొన్నాడు. యాదవ్‌కు తొలి నుంచీ గట్టి పోటీనే ఎదురైంది. మొదటి రౌండ్‌లో 69.96 మీ. విసిరాడు. మూడో త్రోలో 74.09 మీ. విసిరి తన సీజన్ బెస్ట్‌ను నమోదు చేశాడు. ఓ అంతర్జాతీయ వేదికపై జూనియర్ లెవల్‌లో ఆశిశ్‌కు ఇదే తొలి పతకం కావడం గమనార్హం.



## రూ.30,000 కోట్లతో విశాఖ డేటా కేంద్రం తొలిదశ

గూగుల్ ఏఐ ప్రాజెక్టులో భాగంగా.. విశాఖపట్నంలో అదానీకనెక్స్ నిర్మిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) డేటా కేంద్ర ఆర్థిక వివరాలు తొలిసారిగా బయటకు వచ్చాయి. ఇటీవల జరిగిన తొలి త్రైమాసిక ఫలితాల ఎర్నింగ్స్ కాల్‌లో అదానీ గ్రూప్ సీఎఫ్ఓ జుగేశిందర్(రాబీ) సింగ్ ఈ విషయాలను వెల్లడించారు. అదానీ గ్రూప్, అంతర్జాతీయ డేటా సెంటర్ ఆపరేటర్ ఎడ్జ్‌కనెక్స్ సంయుక్త సంస్థ అదానీకనెక్స్. ఈ డేటా కేంద్రంలో ఒక్కో మెగావాట్ నిర్మాణానికి రూ.70-75 కోట్ల వరకు ఖర్చు కావొచ్చని సింగ్ అంచనా వేశారు. తమ పెట్టుబడులపై డాలర్ల రూపంలో 12% ప్రతిఫలాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 1 గిగావాట్ ప్రాజెక్టులో తొలి దశ కింద 400 మెగావాట్ల నిర్మాణాన్ని అదానీకనెక్స్ చేపడుతోంది. ఒక్కో మెగావాట్‌కు రూ.75 కోట్ల చొప్పున లెక్కవేస్తే, తొలిదశ నిర్మాణానికే దాదాపు రూ.30,000 కోట్లు అవుతుంది. 2025 అక్టోబరులో ఈ ప్రాజెక్టును ప్రకటించారు. 1 గిగావాట్ ఏఐ డేటా సెంటర్ సామర్థ్యాన్ని మూడు ప్రాంగణాల్లో నిర్మించనున్నట్లు గూగుల్ - అదానీ సంస్థలు తెలిపాయి. అదానీకనెక్స్, భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన ఎన్ఎక్స్‌ట్రా కలిసి వీటిని అభివృద్ధి చేస్తాయని గూగుల్ వివరించింది. ఎవరు, ఎంత సామర్థ్యం మేర ఏర్పాటు చేస్తున్నారన్నది తెలియరాలేదు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com